క్లుప్తంగా

సింగూరుకు ఇన్‌ఫ్లో

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. అధికారులు ఒక గేట్‌ను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టులో 29.9 టీఎంసీల నీటి నిల్వ ఉంచి, మిగతా నీటిని క్రస్టుగేట్ ద్వారా వదులుతున్నారు. ప్రాజెక్టులోకి 19650 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, దిగువకు 10687 క్యూసెక్కులు, జలవిద్యుత్ కేంద్రం ద్వారా 2,823 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

ఎల్‌ఓసీ అందజేత


ఎల్‌ఓసీని అందజేస్తున్న రాజిరెడ్డి

హత్నూర (సంగారెడ్డి): హత్నూర మండలం బోర్పట్ల గ్రామానికి చెందిన నాగరాణి అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ప్రభుత్వం నుంచి మంజూరైన రెండు లక్షల ఇరవై ఐదు వేల ఎల్‌ఓసీని సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాజిరెడ్డి అందజేశారు.

డామా సెంటర్‌తో లబ్ధి

మునిపల్లి(అందోల్): డామా సెంటర్ ఏర్పాటుతో రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి ప్రథమ చికిత్స చేయొచ్చని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కంకోల్ శివారులోని 45వ సర్వే నంబర్‌లో రెండు ఎకరాల స్థలంలో డామా సెంటర్ ఏర్పాటుపై ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ నెల 6న డామా సెంటర్ ఏర్పాటుకు మంత్రి దామోదర రాజనర్సింహ్మ స్థల పరిశీలన చేసిన విషయం తెలిసిందే. అధికారులు త్వరితగతిన ప్రతిపాదనలు సిద్ధం చేసి, సంబంధిత అధికారులకు పంపించి, పనులు త్వరగా పూర్తయేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వేతన ఒప్పందం చేయాలని నిరసన


రాకూల్ పరిశ్రమ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

జహీరాబాద్ టౌన్: వేతన ఒప్పందం చేపట్టాలని కోహీర్ మండలం కవేలి చౌరస్తాలోని రాకూల్ పరిశ్రమ కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కన్వీనర్ మహిపాల్ మాట్లాడుతూ.. వేతన ఒప్పందం విషయంలో ప్రభుత్వం మొండివైఖరి అవలంబిస్తుందన్నారు. పరిశ్రమలో కార్మిక వేతన ఒప్పందం చేయాల్సి ఉండగా యాజమాన్యం 10 నెలల నుంచి కాలయాపన చేస్తోందని ఆరోపించారు. యాజమాన్యం వైఖరి మార్చుకోని యెడల ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

వ్యక్తిపై ఫిర్యాదు

నారాయణఖేడ్: మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కు చెందిన యతి నర్సింగ్ ఆనంద్‌ను వెంటనే అరెస్టు చేయాలని పలువురు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో మైనార్టీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనాలతో నిరసన తెలిపారు. అనంతరం సంఘం నాయకులు తాహెర్‌అలీ, గౌస్‌చిస్తి, ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు, న్యాయవాది మొహిద్ పటేల్, ఖేడ్ మాజీ సర్పంచ్ నజీబ్, నాయకులు మజహర్, జబ్బార్, ముక్తార్, అంజద్ తదితరులు వేర్వేరుగా డీఎస్పీ వెంకట్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు.

నలుగురిపై కేసు నమోదు

కల్హేర్(నారాయణఖేడ్): మద్యం తాగి వాహనాలు నడుపుతున్న నలుగురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు సిర్గాపూర్ ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి సోమవారం తెలిపారు. సిర్గాపూర్ శివాజీచౌక్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. మందుబాబులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

సదాశివపేట(సంగారెడ్డి): పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి, వారి నుంచి ఐదు సెల్‌ఫోన్లు, రూ.17,090 స్వాధీనం చేసుకున్నామని సీఐ, మహేశ్‌గౌడ్ తెలిపారు. సోమవారం మండలంలోని అంకెనపల్లి గ్రామ శివారులోని ఆంజనేయులు పొలంలోని రేకుల షెడ్డులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎత్తిపోతలను ప్రారంభించండి

నారాయణఖేడ్: బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతల పథకాల పనులను వెంటనే ప్రారంభించాలని సీపీఐ డివిజన్ కార్యదర్శి ఆనంద్, జిల్లా నాయకులు చిరంజీవి పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం సాగు భూములకు ఇబ్బందులు లేకుండా చేయాలనే ఉద్దేశంతో ఎత్తిపోతల పథకాన్ని చేపట్టిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఇంకా పనులు ప్రారంభించలేదన్నారు. గత ప్రభుత్వ విధానాలతో కాకుండా, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.


హత్నూరలో శాకాంబరిగా..


మునిపల్లి(అందోల్): బుదేరా భ్రమరాంబ మల్లికార్జున దేవాలయంలో..


నారాయణఖేడ్: గౌరీదేవి అలంకరణలో దుర్గామాత


రాయికోడ్: లలితసుందరి దేవి రూపంలో..


పటాన్‌చెరు టౌన్: భవానిమాత అలంకరణలో రేణుక ఎల్లమ్మ


రాయికోడ్: కుంకుమార్చన కార్యక్రమంలో..

భవాని మాతగా..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు భక్తులకు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల్లో హోమం, కుంకుమార్చన, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో ఆలయాల పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.


రామలింగేశ్వర దేవస్థానంలో చండీహోమం..


న్యాల్‌కల్(జహీరాబాద్): లలితా త్రిపుర సుందరీదేవిగా..


సదాశివపేట పట్టణంలోని గాంధీచౌక్ వద్ద..


నారాయణఖేడ్: గౌరీదేవిగా నల్లపోచమ్మ తల్లి..

వట్‌పల్లి మార్కెట్ చైర్మన్‌గా లక్ష్మి!


కొప్పుల లక్ష్మి

వట్‌పల్లి(అందోల్): నియోజకవర్గంలో నామినేటెడ్ పదవుల ప్రక్రియ మొదలైంది. పదవుల కోసం ఎదురుచూస్తున్న నాయకుల్లో ఉత్సాహం రెట్టింపు అయింది. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రాతినిధ్యం వహిస్తున్న అందోల్ నియోజకవర్గంలోని వట్‌పల్లి మార్కెట్ కమిటీ పాలకవర్గం ఎంపిక దాదాపు పూర్తయింది. పదవిని ఆశిస్తున్న ఆశావహులతో మంత్రి మాట్లాడి కొలిక్కి తీసుకువచ్చినట్లు సమాచారం. వట్‌పల్లి మార్కెట్ జనరల్ మహిళ రిజర్వు కావడంతో మార్కెట్ పరిధిలోని అల్లాదుర్గం, వట్‌పల్లి, రేగోడు మండలాలకు చెందిన, పార్టీ కోసం పని చేసిన, వారినే ఎంపిక చేయాలని అభిప్రాయాలు తీసుకున్నట్లు సమాచారం. పాలకవర్గం ప్రక్రియకు సంబంధించిన చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల వివరాలను మంత్రి సిఫారసు మేరకు ప్రభుత్వానికి పంపించారు. అల్లాదుర్గం మండలం రాంపూర్‌కు చెందిన కొప్పుల లక్ష్మిని నియమించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఆమె 2006లో రాంపూర్ ఎంపీటీసీగా గెలుపొంది, వైస్ ఎంపీపీగా, 2011లో వట్‌పల్లి మార్కెట్ వైస్ చైర్మన్‌గా పనిచేశారు. ఆమె భర్త ప్రస్తుతం అల్లాదుర్గం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. మండలానికి చైర్మన్ పదవి మొదటిసారి దక్కే అవకాశం ఉండటంతో నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సీడీసీ చైర్మన్‌గా రాంరెడ్డి ప్రమాణ స్వీకారం


రాంరెడ్డిని సన్మానిస్తున్న జగ్గారెడ్డి తదితరులు

సదాశివపేట(సంగారెడ్డి): జిల్లా చెరుకు అభివృద్ధి మండలి చైర్మన్‌గా మండలంలోని కంభాలపల్లికి చెందిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గడీల రాంరెడ్డి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్మన్ నిర్మల ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు, సీడీసీ జనరల్ మేనేజర్ కృష్ణమోహన్, కేన్ కన్సల్టెంట్ వెంకటనర్సయ్య సీడీసీ చైర్మన్‌గా రాంరెడ్డితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం రాంరెడ్డిని జగ్గారెడ్డి, నిర్మలారెడ్డి, జయరెడ్డి కాంగ్రెస్ జిల్లా, నియోజకవర్గ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించి, అభినందించారు. చెరుకు రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జగ్గారెడ్డి సూచించారు. ప్రమాణ స్వీకారోత్సవానికి మాజీ ఎంపీటీసీలు, మున్సిపల్ చైర్మన్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు.

ప్రేమతత్వమే భక్తికి మార్గం


ప్రసంగిస్తున్న మాధవానంద సరస్వతీస్వామి

కంగ్టి(నారాయణఖేడ్): ప్రేమ, ఆప్యాయతతో మాట్లాడడంతోనే భక్తిమార్గం అలవడుతుందని రంగంపేట శ్రీమదనానంద పీఠానికి చెందిన మాధవానంద సరస్వతీ స్వామి అన్నారు. కంగ్టిలోని గణేష్ ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గామాతా విగ్రహానికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. అవసరం ఉన్నా వారిని ఆదుకోవడంలోనే పుణ్యం ఉందన్నారు. ఎల్లప్పుడు భగవత్ నామస్మరణ చేయడంలో ఎంతో సంతృప్తినిస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన అక్షయ్ జోషి, అశోక్‌మహారాజ్, సంతోష్ మహారాజ్, వినోద్‌కుమార్, శ్రీనివాస్ రావు, శ్రీకాంత్‌తో పాటు గ్రామానికి చెందిన భక్తులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

పటాన్‌చెరు: దేవి నవరాత్రులను పురస్కరించుకొని అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలుకాలనీల్లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహగౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవి నవరాత్రులు నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం వివిధ మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నరసింహగౌడ్, నందారం రమేష్‌గౌడ్‌లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాలనీవాసులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

నారాయణఖేడ్: ఖేడ్ ప్రాంత అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించాలని బీజేపీ నాయకులు నీలేష్ మాతాజీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం కరీంనగర్‌కు వెళ్లి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అభివృద్ధి పనులతో పాటు జవహర్ నవోదయ పాఠశాల, పరిశ్రమలను ఏర్పాటు చేయించాలని కోరారు. బండి సంజయ్ స్పందిస్తూ తగిన సమయంలో సహకరిస్తానని హామీనిచ్చారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామస్థాయిలో ప్రజలకు చేరేలా చూడాలని, పార్టీ అభివృద్ధికి పని చేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లాకోర్టు జరిమానా, జైలు శిక్ష విధించింది. ఈ ఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. ఆదివారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 24 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. సోమవారం వారిని సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా, జడ్జి ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున జరిమానా విధించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

మున్సిపల్ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం


రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ క్రాంతి హెచ్చరించారు. సోమవారం తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. మున్సిపల్ రికార్డులను పరిశీలించి, ఆదాయ వనరులపై ఆరా తీశారు. పన్నులు, పలు విషయాలపై కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డుకు ఐదు ఎకరాల భూమిని కేటాయించినా.. దానిని కేవలం డంపింగ్ యార్డుగానే వాడుతున్నారే తప్పా.. తడి, పొడి చెత్తను ఎందుకు వేరు చేయడం లేదని అధికారులను ప్రశ్నించారు. మున్సిపల్ శాఖకు సంబంధించిన మ్యానువల్ అనుమతులను మంజూరు చేయొద్దని అధికారులను ఆదేశించారు. ఎల్‌ఆర్‌ఎస్ రికార్డులను సమీక్షించి, అధికారులకు పలు సూచనలు చేశారు. చెరువుల పరిరక్షణకుపై ప్రత్యేక దృష్టి సారించాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. నూతనంగా మున్సిపాలిటీలో విలీనమైన ముత్తంగి, పాటి, కర్ధనూరు, పోచారం, ఘనాపూర్ గ్రామాల రికార్డులను మున్సిపల్ కార్యాలయంలో స్వాధీనం చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వేను పర్యవేక్షించారు. మళ్లీ తనిఖీలకు వస్తానని, రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని చెప్పారు. మున్సిపల్ కార్యాలయానికి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చిన మున్సిపల్ అధికారులు తమకు సమాచారం ఇవ్వడం లేదని మున్సిపల్ చైర్‌పర్సన్ లలిత కలెక్టర్‌కి తెలియజేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి దేవుజా, మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, తహసీల్దార్ సంగ్రామ్ రెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్ సంఘ సంస్కర్త

ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సంజీవరెడ్డి

నారాయణఖేడ్: అంటరానితనం, కుల వివక్ష నిర్మూలనకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎనలేని కృషి చేశారని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. సోమవారం నిజాంపేట్ మండలం శాఖాపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బాబాసాహెబ్ అంబేడ్కర్ న్యాయవాది,, ఆర్థిక శాస్త్రవేత్త, సంఘ సంస్కర్త అని కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఆయన చూపిన మార్గాన్ని అనుసరించి ముందుకు సాగాలన్నారు. రాజ్యాంగ రచన, సామాజిక, రాజకీయ హక్కుల కోసం కృషి చేసిన మహనీయుడని అన్నారు. బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, నాయకులు పండరిరెడ్డి, లింగారెడ్డి, శివరాథోడ్, రాధాకిషన్, రఘుపతిరెడ్డి, శాఖాపూర్ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

రైతు భరోసా చెల్లించండి : నర్సింహారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న రైతులు

సంగారెడ్డి టౌన్ : రైతు భరోసా నిధులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, క్వింటాళ్లకు 500 బోనస్ ఇవ్వాలన్నారు. అధిక వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎటువంటి నిబంధనలు లేకుండా రుణమాఫీ చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ ప్రభుగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి, జిల్లా కోశాధికారి సదానందరెడ్డి, పలు మండలాల అధ్యక్షుడు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ టాప్2 శాస్త్రవేత్తగా అళగర్ స్వామి

సంగారెడ్డి టౌన్ : మండలంలోని ఎంఎన్‌ఆర్ కళాశాల ఫార్మసీ ప్రిన్సిపాల్ అళగర్ స్వామికి స్టాన్‌ఫోర్డు యునివర్సిటీ ర్యాంకింగ్స్ 2024లో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న టాప్ 2 శాస్త్రవేత్తల్లో ఒకరుగా గుర్తింపు లభించడం సంతోషమని కళాశాల చైర్మన్ ఎంఎస్ రాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వామి ఫార్మసీ, ఫార్మకళాశాల ప్రపంచ వ్యాప్తంగా వరుసగా ఐదవ సారి గుర్తింపు పొందారని, తెలంగాణ రాష్ట్రంలో ఒకటవ ర్యాంకు సాధించారని ఆయన పేర్కొన్నారు. ఎంఎన్‌ఆర్ విశ్వవిద్యాలయం చాన్సలర్ ఎంఎస్ రవివర్మ, కళాశాల యాజమాన్యం అభినందనలు తెలిపారు.

సభ్యత్వ లక్ష్యాన్ని పూర్తి చేయండి

బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి


సభ్యత్వ నమోదులో పాల్గొన్న గోదావరి, నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): బీజేపీ సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని నాయకులు, కార్యకర్తలు విజయవంతంగా పూర్తి చేయాలని జిల్లా అధ్యక్షురాలు గోదావరి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పట్టణ, మండల పార్టీ అధ్యక్షుడు కార్యకర్తలతో కలిసి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించి, సభ్యత్వ నమోదు చేయించాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్‌రావు, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు కేటాయించండి


దుస్తులు పంపిణీ చేస్తున్న లలిత, కౌన్సిలర్లు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మల్లేపల్లి లలిత అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వార్డుల్లోని పలు సమస్యలను కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తెచ్చారు. అనంతరం అభివృద్ధి పనులకు నిధు లు కేటాయించాలని కోరారు. అలాగే, మున్సిపల్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి, పారిశుద్ధ్యం కార్మికులకు నూతన దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్, కౌన్సిలర్లు లచ్చిరాం నాయక్, బాలాజీ, జ్యోతి, పావని, మయూరి, నాగరాజు, శ్రీశైలం ఉన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు

జిల్లా వ్యాప్తంగా సోమవారంలో ఆయా గ్రామాల్లో మహిళలు బతుకమ్మ పండుగను జరుపుకొన్నారు. రంగు రంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఇంటి వాకిళ్లలో పెట్టి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ పాటలు పాడుతూ ఆడిపాడారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు. –సాక్షి నెట్‌వర్క్


హత్నూర(సంగారెడ్డి): బతుకమ్మ సంబరాల్లో తహసీల్దార్


జహీరాబాద్: అమెరికాలో జహీరాబాద్ వాసులు


సంగారెడ్డి టౌన్: బతుకమ్మ ఆడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి


జోగిపేట: బతుకమ్మలను నిమజ్జనానికి తీసుకెళ్తున్న మహిళలు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. చంద్రారెడ్డి -9912220353
కె. సంగారెడ్డి -9010294400